ఏపీలో 1:100.. ఇక్కడెందుకు కాదు?

గ్రూప్ -1మెయిన్స్ అర్హులపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్న

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): 'కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు 100 కోట్లు సంపాదించడానికి వారు చేసేది మీలా రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు' అని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు.కోచింగ్ సెంటర్ల నిర్వాహకులపై సీఎం వ్యాఖ్యలపై బుధవారం ఆయన తీవ్రంగా స్పందించారు. నిరుద్యోగులను కిరాయి మనుషులుగా పేర్కొనటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీని అశోక్‌నగర్‌కు తీసుకెళ్లినప్పుడు రేవంత్‌రెడ్డి సహా ఇతరుల వెంట ఉన్నది కిరాయి మనుషులేనా? అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1కు 1:100 పిలిచినపుడు ఇక్కడెందుకు చేయరని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగులకు సంఘీభావం తెలిపిన ప్రతి వ్యక్తిని తలకుమాసినోడుగా సీఎం అభివర్ణిస్తున్నారని, 2023లో ఇదే పని చేసిన రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీని ఏమనాలని ఆయన ప్రశ్నించారు.

గ్రూప్ -1 పోస్టుల భర్తీలో అక్రమాలు

1: 57 చొప్పున అర్హుల జాబితా ఎందుకు?

బీఆర్ఎస్ నేత రాకేశ్‌కుమార్

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): గ్రూప్ -1 పోస్టుల నియామకాల భర్తీలో అక్రమాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత చిరుమల్ల రాకేశ్‌కుమార్ అన్నారు. బుధవారం నమస్తే తెలంగాణలో వచ్చిన కథనాన్ని ఊటంకిస్తూ టీజీపీఎస్సీ ఇప్పటి వరకు గ్రూప్ -1 కటాఫ్ మార్కులు ప్రకటించలేదని, వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో రాకేశ్ కుమార్ మాట్లాడుతూ గ్రూప్ -1 మెయిన్స్‌కు అర్హత జాబితాను 1:57 ఎందుకు ప్రకటించారని నిలదీశారు. 28,150 మందే అర్హుల జాబితాలో ఉండాల్సి ఉండగా, అదనంగా మరో 3,232 మందిని ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ప్రవీణ్ రెడ్డి, కృష్ణ, సురేశ్, స్వామి యాదవ్, సతీశ్, జహీర్‌ఖాన్, అవినాశ్, శ్రీకాంత్ గౌడ్, యుగేందర్‌రెడ్డి,రవి పాల్గొన్నారు.

ఆంధ్రా పాలకుల్లా రేవంత్ వైఖరి

పదేండ్ల తర్వాత ఓయూలో పోలీస్ రాజ్యం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

ముషీరాబాద్, జూలై 10: ఆంధ్రా పాలకులు ఉద్యమాన్ని అణచివేసినట్టు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగుల పోరాటాన్ని అణచివేయాలని చూస్తున్నదని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. డీఎస్సీ, గూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని ఓయూలో శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు వచ్చి విద్యార్థులు, జర్నలిస్టులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదేండ్ల తర్వాత ఓయూలో పోలీస్ రాజ్యం నడస్తున్నదని మండిపడ్డారు. అన్ని పరీక్షలు 10, 15 రోజుల వ్యవధిలోనే ఉండటం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు వాయిదా కోరుతున్నారని, దాన్ని ప్రభుత్వం రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రెండు మూడు నెలల సమయం ఇస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేమిటని ప్రశ్నించారు. విద్యార్థులపై దాడికి ఓయూ ఇన్‌స్పెక్టర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, వెంకట్, చందు, నరేశ్, తిరుమలేశ్, నాగరాజ్, సురేశ్ పాల్గొన్నారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

బీఆర్ఎస్‌వీ నేత స్వామియాదవ్

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామియాదవ్ డిమాండ్ చేశారు. టెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు డీఎస్సీకి ప్రిపేర్ కావడానికి 3 నెలల సమయం ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీని వేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం నిరుద్యోగులను వాడుకొని సీట్లో కూర్చోగానే ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారంటూ మండిపడ్డారు. ఓయూలో దమనకాండకు తెరలేపారని పేర్కొన్నారు.

- గ్రంథాలయం నుంచి లాక్కెళ్లి..

ఉస్మానియా యూనివర్సిటీ గ్రంథాలయం నుంచి నిరుద్యోగులను లాక్కెళ్లుతున్న పోలీసులు

- పదేండ్ల తర్వాత ఓయూలో బూట్లచప్పళ్లు

ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో భారీగా మోహరించిన పోలీసులు

ఉస్మానియా హాస్టళ్లలో చొరబడి విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పోలీసుల ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి...

అన్ని యూనివర్సిటీలు ఇన్‌చార్జిల పాలనలో కునారిల్లుతున్నాయని, తక్షణమే రెగ్యులర్ వీసీల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేడాలని డిమాండ్ చేస్తూ ప్రొఫెసర్ కోదండరాం ఇంటి ముట్టడికి తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఓయూలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు తలెత్తి రణరంగాన్ని తలపించింది. వరుస ఉద్యమాలతో అట్టుడుకున్న ఉస్మానియా క్యాంపస్ రెండు రోజులుగా ఖాకీల ప్రహారాలోకి వెళ్లింది. పదేండ్లుగా ప్రశాంతంగా ఉన్న విశ్వవిద్యాలయంలో మళ్లీ పోలీసుల బూట్లు, లాఠీల చప్పుళ్లు వినిపించాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు పిడిగుద్దులు కురిపించడం, హాస్టళ్లలోకి చొరబడి విద్యార్థి నేతలను అరెస్ట్ చేయడంపై నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఆగ్రహం పెల్లుబికింది. నిరుద్యోగుల నిరసనలను ఓయూ మెయిన్ లైబ్రరీ నుంచి లైవ్ ఇస్తున్న వీడియో జర్నలిస్టులు (జీ తెలుగు న్యూస్ రిపోర్టర్ శ్రీచరణ్, యూట్యూబ్ చానల్ విలేకరి మైకేల్)లను బుధవారం గల్లాపట్టి పోలీసులు లాక్కెళ్లడం జర్నలిస్టులోకం ఆగ్రహానికి కారణమైంది.పోలీసుల వైఖరిని జర్నలిస్టు సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు వంగ సతీశ్‌రెడ్డి, గొటి రామకృష్ణ, యాలాల శ్రీధర్ తదితరులు ఖండించారు.

విద్యార్థులపై పిడిగుద్దులు

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై పిడిగుద్దులు కురిపించారు. నలుగురు విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా మాట్లాడడమే తమ పాపమా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలం నాటి రోజులు గుర్తొస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నాడు లాఠీ దెబ్బలు, బాష్పవాయు ప్రయోగాలు, రబ్బర్ బుల్లెట్లు, ఇనుప కంచెలకు ఎదురొడ్డి పోరాడామని, అదే స్ఫూర్తితో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి తమ డిమాండ్లు సాధించుకుంటామని స్పష్టం చేశారు.

ఉదయమే హాస్టళ్లలోకి చొచ్చి..

కోదండరాం ఇంటి ముట్టడి పిలుపు నేపథ్యంలో ఉదయమే పోలీసులు హాస్టళ్లలోకి చొరబడి టీఎస్పీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంపటి సురేశ్, ఓయూ అధ్యక్షుడు నూకల మధును గదుల నుంచి బయటకు లాక్కొచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంలో బారి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఇన్నిరోజులు వర్సిటీలు, విద్యార్థులు, నిరుద్యోగుల చుట్టూ తిరిగిన ప్రశ్నించే గొంతుకలు ఇప్పుడు ఎక్కడికిపోయాయని ప్రశ్నించారు. వర్సిటీలకు శాశ్వత వీసీల నియామకం లేక రెండు నెలలైందని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటానని చెప్పిన ప్రొఫెసర్ కోదండరాం దీనిపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన కోదండరాం ఇంటి ముట్టడిని అడ్డుకోవడం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు.

మద్దతు ఇచ్చినందుకు అరెస్ట్..

కొంతకాలంగా ఉద్యమిస్తున్న నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలని, నిరుద్యోగులకు మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, మిథున్ ప్రసాద్‌లను సైతం హాస్టళ్లలోని గదుల నుంచి పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి అరెస్ట్ చేశారు. ఇక్కడ జంగయ్య మాట్లాడుతూ తమను అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరపున పోరాతున్నవాళ్లను హాస్టళ్లలోకి వచ్చి అరెస్టు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి నూకలు చెల్లాయని మండిపడ్డారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం వాటి నుంచి తప్పించుకునేందుకు తమపైకి పోలీసులను ఎగదోస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాలపై మేధావులు, ప్రజాస్వామికవాదులు స్పందించాలని కోరారు.

పకడ్బందీగా ఉద్యమ ప్రణాళికలు

- యూనివర్సిటీలు, జిల్లాలు, గ్రంథాలయాల వారీగా కమిటీలు
- 15న సచివాలయం ముట్టడి
- రాహుల్‌గాంధీ నిలదీతకు త్వరలో 'చలో న్యూఢిల్లీ'
- డిమాండ్లు నెరవేరేదాకా పోరాడుతాం : నిరుద్యోగులు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగాల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు రెచ్చిపోయి తమపై పిడిగుద్దులు గుద్దుతున్నారని, లాఠీచార్జీలు చేస్తున్నారని, తామేమైనా నక్సలైట్లమా? ఉగ్రవాదులమా? అని నిరుద్యోగులు మండిపడుతున్నారు. గ్రూప్-1 మెయిన్స్ కోసం 1:100 నిష్పత్తి అమలు, డీఎస్సీ పరీక్షల వాయిదా సాధ్యం కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడంపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.ఓయూతో పాటు కాకతీయ, ఎంజీయూ, తెలంగాణ, శాతవాహన, పాలమూరు తదితర అన్ని యూనివర్సిటీల్లో నిరుద్యోగ కమిటీలు, జేఏసీలు ఏర్పాటు కాబోతున్నట్టు నిరుద్యోగులు తెలిపారు. జిల్లా గ్రంథాలయాల్లోనూ కమిటీలు వేస్తున్నామని, ఈ మేరకు పకడ్బందీ ఉద్యమ ప్రణాళికలతో ముందుకు పోతామని చెప్పారు.

15న సెక్రటేరియట్ ముట్టడి

ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 15న సచివాలయం ముట్టడికి నిరుద్యోగులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత ఆర్ కృష్ణయ్య, ఇతర పార్టీల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. త్వరలోనే 'చలో న్యూఢిల్లీ' చేపడతామని విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నేతలు వివరించారు. మరోవైపు ఉద్యోగాల కోసం పలువురి నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

ఇందిరమ్మ రాజ్యమంటే.. జర్నలిస్టులపై నిర్బంధమా?

- ప్రజాపాలనలో జర్నలిస్టులకు రక్షణ లేదా?
- అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): 'ఇందిరమ్మ రాజ్యమంటే జర్నలిస్టులపై నిర్బంధమా? ప్రజాపాలనలో జర్నలిస్టులకు కూడా రక్షణ లేదా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఓయూలో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనను కవర్ చేస్తున్న జీన్యూస్ రిపోర్టర్, కెమెరామెన్‌లను అక్రమంగా అరెస్ట్ చేయటం దారుణమని, జర్నలిస్టులపై ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. 'జర్నలిస్టులు వార్తల కవరేజీకి వెళ్లడం నేరమా ? డీఎస్సీ సమస్యపై నిరుద్యోగుల నిరసనను చూపిస్తే తప్పా?' అని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సర్కారును కేటీఆర్ ప్రశ్నించారు. మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద మహిళా జర్నలిస్టులతో దురుసు ప్రవర్తన, బుధవారం ఓయూలో జీన్యూస్ రిపోర్టర్ గల్లాపట్టి అక్రమ అరెస్టును ప్రస్తావిస్తూ ఇందిరమ్మ రాజ్యమంటే జర్నలిస్టులపై జబర్దస్తీ చేయడమేనా? అని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉస్మానియా లో మళ్లీ ఉద్యమం నాటి దృశ్యాలు కనిపిస్తున్నాయ ని, పోలీసుల బూట్ల చప్పు ళ్లు, ముళ్ల కంచెలు చూస్తుం టే విద్యార్థులు మరో ఉద్యమంతో ప్రభుత్వానికి బుద్ధి చెప్పటం ఖాయమని పేర్కొన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసిన జర్నలిస్టు, కెమెరామెన్‌లను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ జర్నలిస్ట్ యూనియన్లు చేసే పోరాటానికి బీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుందని ప్రకటించారు.

సర్కారు నిరంకుశ వైఖరి వీడాలి

- జర్నలిస్టుల అక్రమ అరెస్టు సరికాదు
- ఇది మీడియా స్వేచ్ఛను కాలరాయడమే
- వారిని వెంటనే విడుదల చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- రాష్ట్రంలో అప్రకటిత నిర్బంధం: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస సర్కారు నిరంకుశ వైఖరిని వీడాలని మాజీ మంత్రి హరీశ్‌రావు హితవుపలికారు. ఉస్మానియా యూనివర్సిటీ సాక్షిగా జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసనలు తెలియజేస్తుంటే విధినిర్వహణలో భాగంగా వార్తలు కవర్ చేయడం జర్నలిస్టులు చేసిన తప్పా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం, బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కును, స్వేచ్ఛను కాలరాయడమేనని దుయ్యబట్టారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమైక్యపాలన తలపిస్తున్నది: ఎర్రోళ్ల శ్రీనివాస్

ఓయూలో నెలకొన్న పరిస్థితులు నాటి సమైక్య పాలనను తలపిస్తున్నాయని కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తంచేశారు. ఓయూలో జర్నలిస్టులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు. తమది కంచెల ప్రభుత్వం కాదు, ఆంక్షల ప్రభుత్వం కాదని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ పెద్దలు జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అరెస్టు చేసిన జర్నలిస్టులు, విద్యార్థులు, నిరుద్యోగులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆ పోలీసులను సస్పెండ్ చేయాలి : బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

విద్యార్థులపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డీఎస్సీ వాయిదా వేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు.

ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత నిర్బంధం లేదు

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

జర్నలిస్టులపై జరిగిన దాడి హేయమైనదని, రాష్ట్రంలో అప్రకటిత నిర్బంధం కొనసాగుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజాపాలన పేరుతో ప్రజాస్వామ్యానికి తలవంపుల పాలన సాగుతున్నదని దుయ్యబట్టారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంతటి నిర్బంధం లేదని, ఇటీవలికాలంలో జర్నలిస్టులపై పోలీసులు వరుసగా చేస్తున్న దాడులు ఉద్దేశపూర్వకంగా సాగుతున్నవిగానే చూడాలని పేర్కొన్నారు. నిరుద్యోగుల గొంతు నొక్కాలనే కుటిల యత్నాలను సర్కారు వీడాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం నిరుద్యోగులను వాడుకొని, ఇప్పుడు వారినే అణగదొక్కుతున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేస్తున్న దుర్మార్గాలకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

సీఎం సార్.. మా గోడు వినండి

- మానసికక్షోభను అనుభవిస్తున్నం
- మా ఆందోళనల వెనుక ఎవరూ లేరు
- మా కోసం మేము కొట్లాడుతున్నాం
- మీ కాళ్లు మొక్కుతాం.. దండం పెడతాం
- డీఎస్సీని 3నెలలు వాయిదావేయండి
- సామాజిక మాధ్యమాల్లో నిరుద్యోగుల ఆవేదన

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ) : మేమంతా ఎంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నం. సిలబస్‌ను ఇంత తక్కువ రోజుల్లో చదవలేకపోతున్నా.. సీఎం రేవంత్ సార్.. మా గోడును అర్థం చేసుకోండి. డీఎస్సీని మూడునెలలు వాయిదా వేయాలని పలువురు డీఎస్సీ అభ్యర్థులు కోరారు. డీఎస్సీ వాయిదాపై ప్రభుత్వం తన మొండి వైఖరి వీడకపోవడంతో పలువురు మహిళా అభ్యర్థులు వీడియోలను సోషల్‌మీడియాలో పోస్టుచేశారు. కన్నీటిపర్యంతమవుతూ తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ వీడియోలను చూసి అయినా.. సీఎం రేవంత్ కర్కశమైన మనసు కరుగుతుందేమోనని ఆశాభావం వ్యక్తంచేశారు. డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనల వెనుక బీఆర్ఎస్, కోచింగ్ సెంటర్ల మాఫియా ఉందన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను అభ్యర్థులు తిప్పికొట్టారు. తమ వెనుక ఏ పార్టీ లేదని, ఏ కోచింగ్ సెంటర్‌లేదని ఆయా వీడియోల్లో స్పష్టతనిచ్చారు.

తక్కువ సమయం..ప్రిపేర్ కాలేము

టెట్‌కు డీఎస్సీకి మధ్యలో చాలా తక్కువ సమయమిచ్చారు. మధ్యలో హెచ్‌డబ్ల్యూవో, సీటెట్ ఎగ్జామ్ వల్ల డీఎస్సీకి సరిగ్గా ప్రిపేర్‌కాలేకపోయినం. మాకు సమయం సరిపోవడంలేదు. స్కూల్ అసిస్టెంట్ వాళ్లం ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సిలబస్‌ను చదవాలి. ఎగ్జామ్‌ను వాయిదా వేసి సెప్టెంబర్‌లో పరీక్ష పెడితే డిసెంబర్‌లోపు ప్రక్రియ పూర్తవుతుంది. దయచేసి అర్థం చేసుకోండి. డీఎస్సీ ఎగ్జామ్‌ను వాయిదావేయండి.

– ఓ నిరుద్యోగి

మా బాధలు వినరా ?

కొద్దిరోజులుగా మేం డీఎస్సీని వాయిదా వేయాలని ధర్నాలు చేస్తున్నాం. దీనిని సీఎం తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. నిరుద్యోగులే తమ బాధలను వ్యక్త పరుచుకోవడానికి బయటికొస్తున్నారు. పోలీసులు మమ్మల్ని అరెస్టులు చేస్తున్నారు. కనీసం మా బాధలు వినరా ? జూన్ నెలలో వరుసగా పరీక్షలు పెట్టారు. కనీసం సిలబస్‌ను రివిజన్ చేసేందుకు వీలుపడటంలేదు. దీంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నాం. దీంట్లో ఏ పార్టీ ఇన్వాల్వ్‌కాలేదు. కోచింగ్ సెంటర్ల ప్రమేయం లేదు. మేమే వాయిదా వేయమని కోరుతున్నాం.

– ఓ నిరుద్యోగి

మావి పేదబతుకులు సార్..

నేనొక డీఎస్సీ అభ్యర్థిని. మాకు ఎవరితో.. ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. మేం నిరుద్యోగులం.పేదబతుకులు మావి. జాబ్‌లు వస్తేనే మా జీవితాలు మారుతాయి. దయచేసి కనీసం మాకు రెండు నుంచి మూడు నెలల సమయమివ్వండి. మేం కోరేది అంతే. ఈ మూడు నెలల్లో శ్రద్ధగా చదువుకుంటం. మా జీవితాన్ని బాగుచేసుకుంటం. మీ చెల్లెలిగా వాయిదావేయాలని కోరుతున్నం.

– ఓ నిరుద్యోగి

50 పుస్తకాలు ఎలా చదవాలి?

నేను డైట్ పూర్తిచేశాను. డీఎస్సీకి చదవలేకపోతున్నాను. మాకు భారీ సిలబస్ పెట్టారు. ఎస్జీటీ టీచర్ 50 పుస్తకాలు చదవాలి. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పుస్తకాలు చదవాల్సి వస్తోంది.జీకే, కరెంట్ ఆఫైర్స్, విద్యాదృక్పథాలు ఇలా అనేక సబ్జెక్టులున్నాయి. ఏవిధంగా ప్రయత్నించినా సిలబస్ పూర్తికావడంలేదు. మీరేమో వేరే రాజకీయ పార్టీ వాళ్లమని, వాళ్లే ధర్నాలు చేపిస్తున్నారని ముద్రవేస్తున్నారు. మేం అలాంటి వాళ్లం కాదని ఎట్లా నిరూపించుకోవాలో మాకు అర్థం కావడంలేదు. మా ఆవేదనను గుర్తించి.. డీఎస్సీని వాయిదావేయండి.

– ఓ నిరుద్యోగి

ఈ ప్రభుత్వమొచ్చి ఏం ప్రయోజనం



మాకు ఇద్దరు ఆడపిల్లలు.భార్యాభర్తలం ఉద్యోగం మానేసి డీఎస్సీకి ప్రిపేరవుతున్నం. మాకు న్యాయం జరగకపోతే ఈ ప్రభుత్వమొచ్చి ఏం ప్రయోజనం. నేనే కాదూ నాలాగా ఏడుస్తున్నవాళ్లు, కొట్లాడుతున్నవాళ్లు ఎంతో మంది ఉన్నారు. అయినా ప్రభుత్వం స్పందించడంలేదు. ప్రతిపక్షాలు చేస్తున్నాయమంటున్నారు తప్ప విద్యార్థుల బాధలు పట్టించుకోవడం లేదు. సీఎం రేవంత్ స్పందించకపోతే ఎంతో మంది జీవితాలు నాశనం కావడం తథ్యం. కనీసం రెండు నెలలు డీఎస్సీని వాయిదావేయాలి.

– శారద, కరీంనగర్

మీ కాళ్లు మొక్కుతాం..

నాకు ముగ్గురు పిల్లలున్నారు. వారికి సపర్యలు చేసి చదువుకునేందుకు ఇబ్బందిపడుతున్నా. టెట్‌కు డీఎస్సీకి మధ్య టైం 20 రోజులే ఉంది. డీఎస్సీ సిలబస్ అధికంగా ఉంది. మీ కాళ్లు మొక్కుతా.. దండం పెడతా డీఎస్సీని వాయిదా వేయండి సార్. నాభర్త నాపై చాలా నమ్మకం పెట్టుకున్నడు. మీరు బీఆర్ఎస్ వాళ్లు చేపిస్తున్నారని అంటున్నరు. అదేంలేదు. మా సొంతంగా చేస్తున్నాం. మీ కాళ్లు మొక్కుతాం డీఎస్సీని పోస్ట్‌పోన్ చేయండి సార్.

– ఓ నిరుద్యోగి

ఉద్యోగాలు అడిగితే నిర్బంధాలా?

- కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఎక్కడ?
- ప్రభుత్వ వైఖరిని ఎండగట్టిన నిరుద్యోగులు

ఖైరతాబాద్, జూలై 10 : 'రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థులు నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ వస్తుందని కండ్లలో ఒత్తులు వేసుకొని చూశారు.. నిరుద్యోగులను అడ్డం పెట్టుకొని అధికారంలోకి వచ్చి ఉద్యోగాలు అడిగితే నిర్బంధాలు చేస్తున్నారు' అని గ్రూప్ 2, 3 అభ్యర్థులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభ్యర్థులు ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మఠం శివానంద స్వామి, మహేశ్, స్రవంతి, సింధురెడ్డి, ఈశ్వర్, దామోదర్‌రెడ్డి, క్రాంతికుమార్ మాట్లాడుతూ ఇదే సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి గ్రూప్-1, 2, 3 పోస్టులు పెంచుతామని, పరీక్షలకు స్పష్టమైన గడువు ఉండేలా చూసుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంపునకు మార్చి 6న సర్క్యూలర్ మెమో జారీ చేసిందని, దాని ప్రకారం సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. గ్రూప్ -1 మెయిన్స్ రాసిన వెంటనే గ్రూప్ 2, డీఎస్సీ పరీక్షలు రాయాల్సి ఉంటుందని, తద్వారా లక్షలాది మంది అభ్యర్థులు నష్టపోతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రియాజ్‌లను అనేక సార్లు కలిసినా ఎలాంటి ఫలితంలేదని ఆగ్రహం వ్యక్తంచేశ